క్లుప్తంగా

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

ఆత్మకూరు: కరాటే క్రీడాకారుడు సాయి అనే విద్యార్థికి ఆత్మకూరుకు చెందిన అమ్మా హెల్ప్ లైన్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం అందజేశారు. సాయి ఇటీవల జరిగిన కరాటే పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికై అక్కడ సైతం నైపుణ్యం ప్రదర్శించి ఈ నెల 12వ తేదీ మహారాష్ట్రంలోని నాసిక్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పెన్‌కాక్ స్లాగ్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. అయితే నాసిక్‌కు వెళ్లి పోటీల్లో పాల్గొని రావడానికి అతని ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో సాయం అందించారు.

మున్సిపల్ హైస్కూల్లో కమిషనర్ తనిఖీ


విద్యార్థులకు తాగునీరు అందించే వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కిరణ్

కావలి: పట్టణంలోని కళుగోళమ్మపేటలో ఉన్న మున్సిపల్ హైస్కూల్‌ను మున్సిపల్ కమిషనర్ ఇ.కిరణ్ మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థుల వినియోగించే మరుగుదొడ్లలో పారిశుధ్యాన్ని మెరుగు పరచడానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న విద్యార్థుల తాగునీటి వాటర్ ప్లాంట్ పనిచేస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్నం భోజనం వంటలను రుచి చూశారు.

15న గంధ మహోత్సవం


గంధోత్సవానికి ముస్తాబు చేస్తున్న దర్గా

ఉదయగిరి: పట్టణంలోని స్థానిక పంచాయతీ బస్టాండ్ సమీపంలో కొలువైన హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్‌ఖాదర్ సాహెబ్ ఖాదీ 218వ గంధమహోత్సవం ఈ నెల 15న జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగా 14న రాత్రి 10 గంటలకు హక్కుదారులు, దర్గాకమిటీ ఆధ్వర్యంలో సందల్‌మాలి జరుగుతుందన్నారు. 15న సాయంత్రం 6 గంటలకు దర్గాకమిటీ చదివింపులు, పూల చాందినీ మేళతాళాలతో దర్గాషరీఫ్ చేరుతుందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. అర్ధరాత్రి 2.30 గంటలకు నూరుల్లాఖాన్ ఇంటి వద్ద నుండి గంధం పకీరుల జరబులు, విద్యుత్ దీపాలంకరణలతో గ్రామోత్సవంగా వేకువజామున దర్గాషరీఫ్ చేరుతుందన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెడతారన్నారు. 16న జష్నే చరాగెఫాతెహా (దీపారాధన) కార్యక్రమం జరుగుతుందన్నారు. 17న తహలీల్ ఫాతెహాతో గంధ మహోత్సవం ముగుస్తుందన్నారు.

11న మండల సర్వసభ్య సమావేశం

వరికుంటపాడు: ఈ నెల 11న స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ విజయభాస్కర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గవదగట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

నామినేషన్లు నిల్

ఆత్మకూరు: మండలంలోని చెర్లోయడవల్లి సర్పంచ్ స్థానంతో పాటు పలు గ్రామాల్లోని వార్డు సభ్యుల ఎన్నిక కోసం నిర్వహిస్తున్న నామినేషన్ల ప్రక్రియలో తొలి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. చెర్లోయడవల్లి సర్పంచ్ స్థానంతో పాటు మహిమలూరు పంచాయతీలో 7వ వార్డుకు ఎన్నిక జరగాల్సి ఉందన్నారు.

ఐక్య ఫౌండేషన్ సేవలు విస్తృతం


మాట్లాడుతున్న ఫౌండేషన్ నిర్వాహకులు

ఆత్మకూరు: ఆత్మకూరు కేంద్రంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ఐక్య ఫౌండేషన్ సేవలు విస్తృతం చేయనున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు పయ్యావుల రామకృష్ణ, మారుతీనాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఫౌండేషన్ పేదలకు ఆర్థిక సేవలు అందించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు రూ.17 లక్షలపైగా వ్యయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సురేష్‌చౌదరి, అజీమ్, వెంకటేశ్వర్లు, సురేంద్ర, సుల్తాన్ పాల్గొన్నారు.



• ఈ చిత్రంలో కనిపిస్తున్న అతని పేరు మెట్టుకూరి సుధాకర్‌రెడ్డి. కలిగిరి మండలం అనంతపురం. ఆయన తండ్రి సుందరరామిరెడ్డి 2018లో మృతి చెందాడు. ఆయన ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ కోసం మూడేళ్లుగా ఎదురు చూస్తున్నాడు. అందుకు అవసరమైన అఫిడవిట్, కుటుంబ సభ్యులు ధ్రువీకరణ పత్రాలు అందించలేక పోవడంతో అతనికి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ రాలేదు. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీరు ఇంటి వద్దకే వచ్చి తగిన పత్రాలు తీసుకుని దరఖాస్తు చేయించారు. పైసా ఖర్చులేకుండా.. ఎవరి దగ్గరకు తిరగకుండా ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ రావడం సంతోషంగా ఉందని చెబుతున్నాడు.



• ఈమె పేరు బత్తల సుబ్బమ్మ. ఈమెది సీతారామపురం మండలం దేవమ్మచెరువు. ఈ ఏడాది ఆమె జగనన్న చేయూత పథకానికి అర్హత పొందింది. అందుకు అవసరమైన పత్రాలు అవసరం ఉండడంతో పైసా ఖర్చు లేకుండా వలంటీర్, సచివాలయ అధికారులు ఆమె వద్దకే వెళ్లి అందజేశారు. గతంలో సర్టిఫికెట్లు కావాలంటే డబ్బుతో పాటు, సమయం కూడా ఖర్చు చేయాల్సి ఉండేది. ఇప్పుడు సీఎం జగనన్న పుణ్యమా అంటూ అణా పైసా పెట్టకుండా పత్రాలు వచ్చాయి. ఇలాంటి మంచి సీఎం పది కాలాలు పాటు ఉండాలని ఆమె చెబుతున్నారు.

సంక్షేమానికి 'సురక్ష'

ధ్రువ పత్రాలు లేక.. ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోయిన వారికి సైతం సంక్షేమ పథకాలు అందించాలనే కృత నిశ్చయంతో ఆయా కుటుంబాలకు అవసరమైన ప్రత్యేకంగా జగనన్న సురక్ష ప్రత్యేక డ్రైవ్ పెట్టి ధ్రువపత్రాలను అందించింది. గత ప్రభుత్వ కాలంలో ఇలాంటి సర్టిఫికెట్లు కావాలంటే తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సచివాలయ వ్యవస్థ ద్వారా నిర్దిష్ట వ్యవధిలో సర్టిఫికెట్లు అందిస్తున్నారు.

• పైసా ఖర్చు లేకుండా 11 రకాల ధ్రువపత్రాల పంపిణీ
• నియోజకవర్గంలో 69,228 సర్టిఫికెట్ల అందజేత




సీతారామపురం మండలంలో సమన్వయకర్త రాజారెడ్డితో కలిసి పత్రాలు అందజేస్తున్న కలెక్టర్

మండలం	సచివాలయాలు	అందించిన పత్రాలు
ఉదయగిరి	12	7,222
వరికుంటపాడు	12	7,113
సీతారామపురం	9	4,751
దుత్తలూరు	11	10,354
వింజమూరు	11	6,812
కలిగిరి	14	9,761
జలదంకి	13	8,186
కొండాపురం	13	12,269
మొత్తం	95	69,228

ఉదయగిరి: సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసే నిమిత్తం ప్రభుత్వం జగనన్నా సురక్ష కార్యక్రమం చేపట్టింది. ఇది లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతోంది. పలు సాంకేతిక సమస్యలు, చిన్న చిన్న కారణాలతో అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు పొందలేక ఇబ్బంది పడుతున్న సమస్యకు చెక్ పెట్టేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వివిధ పథకాలు పొందేందుకు అర్హులైన వారిని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గుర్తించి వారికి అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకున్నారు. వాటిలో కుల, ఆదాయ, నివాస, జనన, మరణధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి. వీటితో పాటు మ్యూటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్స్, కరెక్షన్స్, మ్యారేజ్ , ఫ్యామిలీ మెంబరు, ఆధార్ సేవలు, కౌలు రైతు పత్రాలు, కొత్త రైస్ కార్డులు, రేషన్‌కార్డుల్లో సభ్యుల తొలగింపు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ సేవలు ఉన్నాయి. ఉదయగిరి నియోజకవర్గంలో లబ్ధిదారుల అవసరాలకు అనుగుణంగా 69,228 సర్టిఫికెట్లను నెల రోజుల్లో అందజేశారు.

జగనన్నా సురక్ష ద్వారా పలు సేవలు



జగనన్న సురక్ష ద్వారా ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో ఎన్నో సేవలు అందించడం జరిగింది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారుల సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజలకు అవసరమైన పత్రాలు అందజేశాం. ఈ పత్రాలు ద్వారా పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందే అవకాశం ఏర్పడింది. ప్రజలకు మేలు చేయడమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం ప్రయత్నం చేస్తున్నారు.

– మేకపాటి రాజారెడ్డి, ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

వలంటీర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ఆత్మకూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఆరు వలంటీర్ల పోస్టులకు మంగళవారం ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ ఇంటర్వ్యూ నిర్వహించారు. బట్టేపాడు, బండారుపల్లి, కరటంపాడు, ఆరవీడు గ్రామాల్లో ఒక్కొక్క ఖాళీ చొప్పున, మహిమలూరులో రెండు ఖాళీలు ఏర్పడడంతో వాటి భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలకు తొమ్మిది మంది హాజరైనట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈఓపీఆర్‌డీ లలితారాణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మండలంలోని పానుగోడు, హసనాపురంలో వలంటీర్ ఖాళీలకు మంగళవారం ఎంపీడీఓ ఎం.భాస్కర్ ఇంటర్వ్యూ నిర్వహించారు. అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి వారికి త్వరలోనే నియామక ఉత్తర్వులను అందజేస్తామని తెలిపారు.

పంచాయతీ వ్యవస్థను అభివృద్ధి పరచాలి

చేజర్ల: గ్రామ స్వరాజ్యం గ్రామాల అభివృద్ధికి పంచాయతీ వ్యవస్థలను అభివృద్ధి పరచాలని బీజేపీ అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. మంగళవారం చేజర్లలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 14, 15 ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకే ఖర్చు చేయాలన్నారు. ఈ నెల 10న నెల్లూరు కలెక్టరేట్ వద్ద సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణకు ధర్నా చేపడుతున్నామన్నారు. బీజేపీ నాయకులు కుంకు బాలయ్యనాయుడు, బత్తల కృష్ణయ్య, వెంకటరామానాయుడు పాల్గొన్నారు.

గంధ మహోత్సవం

చేజర్ల (సోమశిల): అనంతసాగరంలోని హజరత్ కరిముల్లా షా ఖాదరి దర్గాలో 130వ గంధ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం అన్నదానాన్ని నిర్వహించి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఖవ్వాలి ప్రోగ్రాం భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

సీ ఫుడ్ ఫెస్టివల్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


సీఫుడ్ ఫెస్టివల్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, మత్స్యశాఖ అధికారులు

ఆత్మకూరు: నెల్లూరులో ఈ నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించే సీ ఫుడ్ ఫెస్టివల్ వాల్‌పోస్టర్లను ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తన నివాసంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి టి.శ్రీనివాసులు, సాగరమిత్ర రేష్మాపర్వీన్ సీఫుడ్ ఫెస్టివల్ గురించి వివరించారు. పోస్టర్ల ఆవిష్కరణ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ మత్స్య ఉత్పత్తుల డొమెస్టిక్ మార్కెటింగ్‌ను ప్రోత్సహించడానికి మత్స్యశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సీఫుడ్ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తుందన్నారు. నెల్లూరులో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఫెస్టివల్‌లో సముద్ర ఉత్పత్తులైన చేపలు, రొయ్యలు, పీతలతో తయారు చేసిన పలు రకాల వంటకాలు, మాంసాహార ప్రియులకు కనువిందు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మత్స్యకారులను ప్రోత్సహించేందుకు సీ ఫుడ్ ఫెస్టివల్ వంటి వాటిని ప్రోత్సహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఈ నెల 11 నుంచి సీఫుడ్ ఫెస్టివల్

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: సముద్ర మత్స్య సంపద ఉత్పత్తులు అధికంగా ఉన్నప్పటికీ వినియోగం తక్కువగా ఉండడం, ప్రజల్లో సముద్ర ఆహారంపై అవగాహన చైతన్యం పెంపొందించడానికి ఈ నెల 11, 12, 13 తేదీల్లో నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో సీఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. స్థానిక ఆయన నివాసంలో మంగళవారం సీ ఫుడ్ ఫెస్టివల్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే సీఫుడ్ ఫెస్టివల్‌లో రూ.699లకే చేపలు, రొయ్యలు, పీతలతో పలు రకాల వంటకాలు మధ్యాహ్నం, రాత్రి విందు భోజనం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాన్ వెజ్ ప్రియులు పాల్గొని రుచికరమైన సముద్ర ఆహార ఉత్పత్తుల రుచులను ఆస్వాదించి విజయవంతం చేయాలన్నారు.

ఎమ్మెల్యే మేకపాటిని కలిసిన స్కూటర్ యాత్రికుడు


అడవికొట్టు రాజును అభినందిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ 175 నియోజకవర్గాల్లో స్కూటర్‌పై యాత్ర చేస్తున్న ఉదయగిరి నియోజకవర్గం జలదంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన అడవి కొట్టు రాజు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జెండాదిబ్బలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేను కలిసి రాజు మాట్లాడారు. 175 నియోజకవర్గాల్లో పర్యటించి తిరుగు ప్రయాణంలో ఎమ్మెల్యేని కలవడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అడివికొట్టు రాజును పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యం ముఖ్యం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ

• డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

సంగం: విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో 5.63 లక్షల మంది పిల్లలకు నులి పురుగుల నివారణా మాత్రలు అందజేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సూచించారు. సంగంలోని బాలయోగి గురుకుల పాఠశాలను మంగళవారం డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సందర్శించారు. పాఠశాలలో నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారా లేదా అని ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు 10న జరిగే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సంబంధించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నులి పురుగుల మాత్రలు వేయడం వల్ల విద్యార్థులు ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందకుండా దేశ వ్యాప్తంగా ఒకేసారి నులి పురుగుల మందులు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపల్ సుమతి తదితరులు ఉన్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలించి చిన్నారితో ముచ్చటిస్తున్న డీఎంహెచ్‌ఓ

సక్రమంగా నులుపురుగుల మందు పంపిణీ

ఆత్మకూరు: జాతీయ నులుపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అల్‌బెండజోల్ మాత్రల పంపిణీ సక్రమంగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ ఎం పెంచలయ్య అన్నారు. పట్టణంలోని జేఆర్‌పేట ప్రాంతంలో అంగన్‌వాడీ సెక్టార్ కేంద్రాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. నులి పురుగుల నివారణ మాత్రలు అన్ని కేంద్రాలకు చేరాయా అని అడిగి నిర్ధారించుకున్నారు. ఆయన మాట్లాడుతూ నులి పురుగుల నిర్మూలన వల్ల రక్తహీనత ఏర్పడి శారీరక ధృడత్వం తదితర ప్రయోజనాలు కలుగుతాయని సూచించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రమోద్, అర్బన్ సెంటర్ డాక్టర్ ఎస్‌కే అస్మా, సిబ్బంది సీహెచ్ రామకృష్ణ, అంగన్‌వాడీ నిర్వాహకులు పి రాధమ్మ, సహాయకులు పాల్గొన్నారు.

ఆనకట్టపై ముళ్లకంప చెట్ల తొలగింపు


యంత్రంతో చెట్లు తొలగిస్తున్న దృశ్యం

ఉదయగిరి: ఉదయగిరి ఆనకట్టపై పెరిగిన ముళ్లకంప చెట్లను మంగళవారం తొలగించారు. గ్రామకొలను పథకంలో భాగంగా ఉదయగిరి ఆనకట్ట అభివృద్ధికి గతంలో నిధులు మంజూరు చేశారు. వర్షాల కారణంగా కొన్ని నెలలుగా పనులు నిలిచిపోయాయి. జలవనరుల శాఖ అధికారుల సూచనల మేరకు కాంట్రాక్టర్ కంపచెట్లను తొలగించడంతో పాటు కోతకు గురైన ప్రాంతాన్ని పూడ్చి వేశారు. రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని కట్ట చుట్టూ రివిట్‌మెంట్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఓటర్ల సర్వేపై సమీక్ష


సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌ఓ సువర్ణమ్మ

ఉదయగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలో జరుగుతున్న ఇంటింటా ఓటర్ల జాబితా సర్వేపై నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.సువర్ణమ్మ సిబ్బందితో సమీక్షించారు. నియోజకవర్గంలో సర్వే ఎలా జరుగుతోంది.. ఇప్పటి వరకు ఎంతమంది ఓటర్లను సర్వే చేశారు.. ఓటర్ల నమోదు ప్రక్రియ తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సర్వే పక్కాగా నిర్వహించి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె సర్వే రిపోర్టును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీష్‌బాబు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ లలితమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా ఓటర్ల సర్వే

ఆత్మకూరు: మున్సిపాలిటీలోని 8 సచివాలయాల పరిధిలో బీఎల్‌ఓలు, పార్టీల ముఖ్య నాయకులతో కలిసి ఓటర్ల సర్వే ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించి ఆ ఇంటిలోని వారిని వివరాలు అడిగి తెలుసుకుంటూ సర్వే చేస్తున్నారు. పూర్తిగా పట్టణం వదిలి వెళ్లిన వారి పేర్లు, మృతులు, తదితర వాటిని గుర్తించి ప్రత్యేకంగా నమోదు చేస్తున్నట్లు బీఎల్‌ఓలు తెలిపారు. పట్టణంలోని 148వ బూత్‌లో బూత్ కన్వీన ఉల్సా పెంచలయ్య, బీఎల్‌ఓ జనార్దన్, చల్లా మోహన్ పాల్గొన్నారు.

సంఘీభావ శాంతి ర్యాలీని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న కాకు వెంకటయ్య

ఉదయగిరి: మణిపూర్‌లో జరుగుతున్న విధ్వంసకాండను నిరసిస్తూ బుధవారం ఉదయగిరిలో సమాఖ్య క్రైస్తవ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సంఘీభావ శాంతిర్యాలీని విజయవంతం చేయాలని ఏజేసీ నాయకులు కాకు వెంకటయ్య పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో శాంతి ర్యాలీ నిర్వహణపై జేఏసీ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు దస్తగిరి అహ్మద్, షేక్ రియాజ్, ఇ.ప్రసాదరావు, ఎస్తాని, షంషీర్, ఆరోన్, అబ్రహాం, నాయబ్, కె.రమణయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


గడప గడపకు మన ప్రభుత్వంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తూ ప్రతిఒక్కరి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని జెండాదిబ్బ, అరవపాళెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 99 శాతం ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. మిగిలిన ఒక్క శాతం మందికి సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందలేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. అందులో భాగంగా ఆత్మకూరు నియోజకవర్గంలో 90 వేల ధ్రువీకరణ పత్రాలను అందజేశామని వివరించారు. తద్వారా నూరు శాతం మందికి సంక్షేమ పథకాలు లభించాయన్నారు. రెవెన్యూ వ్యవస్థలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులతో 70 శాతం సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేశామని చెప్పారు. ఈ నెల 10న ఆత్మకూరులోని శ్రీధర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్న సభలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి రెవెన్యూ సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ సదస్సుకు హాజరుకావాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అనుబంధంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ఇటీవల ఏడీఎఫ్ బెంగళూరు ఛాప్టర్‌ను ప్రారంభించామని, త్వరలో హైదరాబాద్, చెన్నైతో పాటు అమెరికాలోనూ ఏడీఎఫ్‌ను విస్తరించి అభివృద్ధిలో ఆత్మకూరు వాసులను భాగస్వాములను చేయనున్నామని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రతిపక్షాలు రాష్ట్రం అప్పుల పాలవుతోందని విమర్శలు చేస్తున్నారని, దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రే స్వయంగా ఈ ప్రభుత్వం కంటే గత ప్రభుత్వమే అధికంగా అప్పులు చేసిందని వెల్లడించారని చెప్పారు. జగనన్న ప్రభుత్వం ప్రతి రూపాయి ఖర్చును వివరిస్తోందని, గత ప్రభుత్వంలో చేసిన ఖర్చును టీడీపీ ఇలా వివరించగలదా అని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం రాబోయే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. తొలుత ఎమ్మెల్యేకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, సర్పంచ్ పద్మమ్మ, శంకరయ్య, ఎంపీటీసీ సభ్యుడు సుబ్బారెడ్డి, తదితరులు ఘన స్వాగతం పలికారు. జెడ్పీటీసీ రావుల లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ ఎం దేవసహాయం, పార్టీ సీనియర్ నాయకుడు కంటాబత్తిన రఘునాథరెడ్డి, మెట్టుకూరు వాసుదేవరెడ్డి, జేసీఎస్ కోఆర్డినేటర్ ముడి మల్లికార్జునరెడ్డి, ఉపసర్పంచ్ గుర్రం నరేష్ గుప్తా, కోఆప్షన్ సభ్యులు మనూర్, బాబు, చిన్న, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు మానికల చందన్‌కుమార్, ఆనం ప్రసాద్‌రెడ్డి, నేతలు గుండాల బాలచంద్రారెడ్డి, ఫణికుమార్‌రెడ్డి, కరిముల్లా,తదితరులు పాల్గొన్నారు.

జలాశయం కట్టపై కంపకర్ర చెట్ల తొలగింపు


కట్టకు ఇరువైపులా చెట్లు తొలగించిన దృశ్యం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం పొన్నెబోయిన చెంచురామయ్య గండిపాళెం జలాశయం కట్టపై ఉన్న కంప కర్ర చెట్లను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. కట్టకు లోతట్టు, బయట వైపు ఏపుగా చిల్లకర్ర కంప చెట్లు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తోండేది. చెట్లు తొలగించి కట్టకు ప్రమాదం లేకుండా చూడాలని పలువురు ఆయకట్టు రైతులు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో జలవనరుల శాఖ ఈఈ ప్రత్యేక చొరవ తీసుకుని ఇటీవల కట్టకు ఇరువైపులా పెరిగి ఉన్న కంపచెట్లను తొలగించారు. ప్రస్తుతం కట్ట సందర్శకులు చూసేందుకు సుందరంగా కనిపిస్తోంది.